క్లుప్తంగా

అమ్మ వారికి వెండి గాజుల బహూకరణ



పైడితల్లి అమ్మవారికి వెండి గాజులను వేస్తున్న కర్రోతు శంకర్రావు, బాలకృష్ణ

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామంలో కొలువైన పైడితల్లి అమ్మవారికి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రోతు శంకర్రావు, కర్రోతు బాలకృష్ణ కలిసి సుమారు రూ.80 వేల విలువ చేసే వెండి గాజులను మంగళవారం అమ్మవారికి బహూకరించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌పై తస్మాత్..



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాధిక

పూసపాటిరేగ: ఎన్నికల కోడ్‌పై అప్రమత్తంగా వుండాలని ఎంపీడీఓ ఎం.రాధిక అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందంతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో రాజకీయ ఫ్లెక్సీలతో పాటు వివిధ హోర్డింగ్‌లు ఎక్కడున్నా తొలగించాలన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే ఎటువంటి కార్యకలాపాలు జరిగినా అప్రమత్తతతో వ్యవహరించి కట్టడి చేయాలన్నారు. గ్రామాలలో అనుమానస్పదంగా సంచరించే వాహనాలు, వ్యక్తులను తనిఖీలు చేయాలన్నారు. సమావేశంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రించరూ..



పూసపాటిరేగ జాతీయ రహదారిలో ట్రాఫిక్

పూసపాటిరేగ: స్థానిక రాజా వీధిలో ట్రాఫిక్‌తో పాదచారులు, ప్రయాణికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నిత్యం రాజవీధి గుండా వందలాది మంది విద్యార్థులు, వివిధ శాఖల ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. స్టేట్‌బ్యాంకు సమీపంలో రహదారిపైనే వాహనాలు పార్కు చేయడంతో అటుగా వెళ్లే ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆ రహదారిలో పాఠశాలలకు చెందిన స్కూల్ బస్‌లు వెళ్తుంటాయి. గత కొంత కాలంగా ఇదే దుస్థితి వున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ నియంత్రించాలని వాహన చోదకులు, గ్రామస్తులు, పాదచారులు కోరుతున్నారు.

వైద్య ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 21 వినతులు



వినతులు స్వీకరిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 21 వినతులు వచ్చాయి. డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు వైద్య ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించారు. జీతాలకు సంబంధించిన సమస్యలపై వినతులు ఇచ్చారు.

యోగాతో మంచి ఆరోగ్యం

- ఆయుర్వేద సీనియర్ మెడికల్ ఆఫీసర్ ధనుంజయరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ధనుంజయరావు

విజయనగరం ఫోర్ట్: యోగా చేయడం ద్వారా మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రభుత్వ ఆయుర్వేద సీనియర్ మెడికల్ ఆఫీసర్ ధనుంజయరావు పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని కణపాక అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ బిజీ షెడ్యూల్‌లో ప్రతి ఒక్కరికీ శారీరక మానసిక ఒత్తిడి కలగడం వల్ల ఆర్థరైటిస్ వంటి అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆవరణలో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యకళాశాలలో 210 రకాల మందులతో పంచకర్మ, మెడిటేషన్ వంటి కార్యక్రమాల ద్వారా చక్కని ఆరోగ్యం అందించనున్నట్లు చెప్పారు. నేచురోపతి వైద్యురాలు స్వప్న మాట్లాడుతూ మంచి ఆరోగ్యం కోసం మంచి ఆహారపు అలవాట్లు, మంచి జీవన విధానాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని హితవు పలికారు. యోగా నిపుణురాలు మహాలక్ష్మి, సూపర్‌వైజర్ అనూరాధ, ఆయుర్వేద సహాయకులు రామకృష్ణ, యామిని, మహిళా సంరక్షణ కార్యదర్శి రాజరాజేశ్వరి, ఏఎన్ఎం చాందిని తదితరులు పాల్గొన్నారు.

ఊరు బాగు.. ప్రజా సంక్షేమం కోసం ఆలోచించండి

- గెలిచినప్పుడు అనుకోలేదు ఇన్ని అభివృద్ధి పనులు చేస్తానని
- నగరంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటేయండి
- టీడీపీ నాయకుల్లా ఎన్నికల సమయంలో ఓట్లు అడిగే తత్వం కాదు మాది
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- చాంబర్ ఆఫ్ కామర్స్, రోటరీ, ఇన్నర్ వీల్ క్లబ్ ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ఊరు బాగు, ప్రజల సంక్షేమ కోసం ఆలోచించి త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో విజ్ఞులంతా తమ నిర్ణయాన్ని వెల్లడించాలని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. 2019 ఎన్నికల్లో ప్రజలందరి ఆశీర్వాదంతో విజయం సాధించినపుడు తాను ఇన్ని వందల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగలనని అనుకోలేదని, అందరి సహకారంతో శక్తికి మించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగలిగామని పేర్కొన్నారు. గడిచిన నాలుగేళ్ల 10 నెలల కాలంలో నగరంలో జరిగిన అభివృద్ధి చూసి ఓటు వేయాలని అభ్యర్థించారు. నగరంలోని హోటల్ ఎస్‌వీఎన్ లేక్ ప్యాలెస్‌లో చాంబర్ ఆఫ్ కామర్స్, రోటరీ క్లబ్, రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్, ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ తనకు మరోసారి విజయనగరం ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండటమే కాకుండా సమస్యలు లేని విజయనగరంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. నగరంలో నీటి సమస్యకు తావు లేకుండా చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నగరంలో 10 ప్రాంతాల్లో వాటర్ ట్యాంక్‌లు నిర్మించటంతో పాటు కొత్త కుళాయి కనెక్షన్‌లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు తాగు నీటికి ఇబ్బందులు పడకుండా ఉండాలని గడిగెడ్డ రిజర్వాయర్ నుంచి చంపావతిలోకి నీటిని మళ్లించి పంపింగ్ చేయటం జరుగుతుందన్నారు. వచ్చే నెలకి ఆ నిల్వలు అడుగంటిపోనున్నాయని, అప్పటికీ పార్వతీపురం-మన్యం జిల్లాలో గల తోటపల్లి రిజర్వాయర్ నుంచి గడిగెడ్డలోకి ఇప్పటికే మళ్లించిన నీటిని వినియోగించుకునేలా చర్యలు పూర్తి చేశామన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గంజాయి వ్యాపారం చేస్తున్నారని, ఇసుక దోపిడి చేస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్న కూటమి నాయకులు అవి వాస్తవమని నిరూపించగలరా అంటూ ప్రశ్నించారు. కోవిడ్ సమయంలో బాధ్యత గల ప్రజాప్రతినిధిగా ప్రజలకు ధైర్యం కల్పిస్తూ అవసరమైన వైద్య సదుపాయాలను కల్పించి ప్రజల ప్రాణాలను కాపాడగలిగామన్నారు. ఎన్నికల సమయంలో ప్రజల ముందుకు వచ్చి లేనిపోని ఆరోపణలు చేసి పబ్బం గడుపుకునే రోజులు పోయాయని, ప్రజలకు అందుబాటులో లేని నాయకులు ఇలాంటి మాటలు చెప్పి ఓట్లు దండుకునేందుకు దిగజారిపోవటం సిగ్గు చేటన్నారు. సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాపుగంటి ప్రకాష్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు రాజేష్, బాలాజీ, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు సుధ, వివిధ డివిజన్‌ల కార్పొరేటర్‌లు తదితరులు పాల్గొన్నారు.

రామకోనేరులో అపరిశుభ్రత



రామతీర్థంలో అపరిశుభ్రంగా దర్శనమిస్తోన్న భాస్కర పుష్కరిణి

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో రామకోనేరులో అపరిశుభ్రత వాటిల్లింది. భాస్కర పుష్కరిణిగా పిలవబడుతున్న ఈ కోనేరును రూ.75 లక్షల నిధులతో అభివృద్ధి చేశారు. కోనేరును లోతు చేసిన తరువాత ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో అంతంతమాత్రంగానే కోనేరులో నీరు చేరింది. దీంతో పుణ్య స్నానాలు ఆచరించేందుకు వస్తున్న భక్తులు సమీపంలో కుళాయిలను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం కోనేరుతో పాటు పరిసర ప్రాంతాలు పూర్తి స్థాయిలో అపరిశుభ్రంగా మారాయి. గుర్రెపుడెక్క పెరిగి, కోనేరు మొత్తం నాచు పట్టింది. ఉన్న అరకొర నీటిని కనీసం తలపై చల్లుకునేందుకు కూడా అవకాశం లేకుండా పోయిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుళాయిల నుంచి నీరు కూడా సరిగా రావడం లేదని చెబుతున్నారు. దేవస్థాన అధికారులు నిర్వహణను పూర్తిగా పక్కన పెట్టారని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

నీటి పన్ను బకాయిల వసూళ్లపై నిర్లక్ష్యం వద్దు

- కమిషనర్ మల్లయ్య నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్నకమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: దీర్ఘకాల కుళాయి పన్ను బకాయిదారులను ఉపేక్షించవద్దని సిబ్బందికి, కార్యదర్శులకు నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సూచించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం సచివాలయాల వారీగా సమీక్ష నిర్వహించారు. అనేక చోట్ల కుళాయి పన్నులు బకాయిలు పడ్డాయని, ఈ విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఎప్పటికప్పుడు పన్ను వసూళ్లను చేపడుతూ ఉండాలన్నారు. దీర్ఘకాల కుళాయి పన్నుదారుల కనెక్షన్లను తొలగించాలని ఆదేశించారు. కుళాయి పన్నుల బకాయిలు వలన నీటి పంపిణీ నిర్వహణ ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు. పన్నులను త్వరితగతిన వసూలు చేసి నీటి నిర్వహణకు తోడ్పాటునందించాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ తిరుమలరావు, ఇన్‌చార్జి ఈఈ దక్షిణామూర్తి, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల నియమావళి అమలు



కొత్తపేటలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ

నెల్లిమర్ల రూరల్: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలని ఎంపీడీఓ గిడితూరి రామారావు సూచించారు. మండలంలోని కొత్తపేట, గొర్లిపేట, సీతారామునిపేట, రామతీర్థం గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఆయా గ్రామాల్లో ఎంసీసీ అమలుపై క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో క్షేత్ర స్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలన్నారు. రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, చిత్రపటాలు లేకుండా చూసుకోవాలని, విగ్రహాలకు ముసుగులు ధరించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ ప్రయాణం తగునా..



విజయనగరం జిల్లా కేంద్రంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అవగాహన లోపంతో ప్రయాణికులు బస్సులో ఫుట్‌పాత్ ప్రయాణాలు చేస్తున్నారు. ముఖ్యంగా యువత బస్సులో ఖాళీగా ఉన్నప్పటికీ లోపలికి వెళ్లకుండా ఇలా ప్రమాదకరమైన ప్రయాణం చేస్తున్నారు. ప్రతీ రోజు కోట నుంచి సాయంత్రం వెళ్లే తిప్పలవలస బస్సు ఇలానే కనిపిస్తూ చూపరులకు భయం కలిగిస్తుంది. కుర్రకారు తగు జాగ్రత్తలు పాటిస్తూ ప్రయాణం చేయడం మంచిదని పలువురు సూచిస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం



వెండి మండపం వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానం ఆలయ అర్చకులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత నూతన యాగశాలలో విశేష హోమాలు జరిపించారు. అనంతరం స్వామి వెండి మండపం వద్ద సీతారాముల కల్యాణాన్ని వేడుకగా నిర్వహించి స్వామివారి పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవం జరిపించారు. పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో సీతారామస్వామికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు కిరణ్‌కుమార్, నరసింహాచార్యులు, రామగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి ఊరేగింపు



వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

డెంకాడ: చింతలవలస ఏపీఎస్‌పీ బెటాలియన్ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవంలో భాగంగా వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు ఊరేగింపు ఉత్సవం మంగళవారం సాయంత్రం ఘనంగా జరిగింది. మేళతాళాలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య భక్తులు వేంకటేశ్వరస్వామిని ఊరేగించారు.


ప్రశాంతంగా పది పరీక్షలు

డెంకాడ: మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి రెండో రోజు పరీక్ష మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. పెదతాడివాడ జంక్షన్ వద్ద ఉన్న మెర్సీమిషన్ పాఠశాల కేంద్రంలో 242 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 239 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ముగ్గురు హాజరు కాలేదు. జొన్నాడ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 167 మంది విద్యార్థులకుగాను 166 మంది పరీక్ష రాయగా, ఒకరు గైర్హాజరయ్యారు. చింతలవలస ఐదవ ఏపీఎస్‌పీ బెటాలియన్‌లోని ఎస్‌వీఎస్ పాఠశాలలో 151 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 139 మంది పరీక్ష రాశారు. 12 మంది గైరహాజరయ్యారని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

చీపురుపల్లి రూరల్(గరివిడి): ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఎస్.ఆరుద్ర అన్నారు. బొండపల్లి ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని కాపుశంబాం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు. సమతుల ఆహారంతో పాటు వ్యాయామం చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జ్యోతి, రాధిక, శకుంతల, అరుణ, కార్యకర్తలు కృష్ణవేణి, అన్నపూర్ణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామి కల్యాణం



ఆలయంలో వేంచేసి ఉన్న అలివేలుమంగ పద్మావతి సహిత శ్రీనివాసుడు

డెంకాడ: చింతలవలస ఐదవ ఏపీఎస్‌పీ బెటాలియన్ వద్ద ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి 40వ వార్షికోత్సవం బుధవారం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. స్వామి వార్షిక కల్యాణ మహోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. ఉదయం యాగశాల పూజ, ధ్వజారోహణం తదితర పూజా కార్యక్రమాలు జరుగుతాయి. వేదపండితుల మంత్రోచ్చారణ, పూజలతో సాయంత్రం స్వామివారి కల్యాణం జరుగుతుంది. దీనిలో దంపతులు,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి కల్యాణం తిలకించడంతో పాటు పూజలు చేస్తారు. 21వ తేదీన యాగశాల పూజలు, విశేష హోమాలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. 22వ తేదీన మహాశాంతి హోమం, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, ధ్వజ అవరోహణం పూజా కార్యక్రమాలు జరుగుతాయి. అనంతరం ఋత్విక్ సన్మానం, మహదాశీర్వచనమ్ జరుగుతాయని తెలిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం జరుగుతుందని భక్తులు పాల్గొని స్వామి ప్రసాదాన్ని స్వీకరించాలని ఆలయ కమిటీ కోరింది.

భక్తిశ్రద్ధలతో పైడితల్లి చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న వేద పండితులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం పురస్కరించుకుని స్థానిక మూడు లాంతర్లు వద్దనున్న చదురుగుడి ఆవరణలో మంగళవారం చండీయాగం నిర్వహించారు. వేదపండితులు తాతా రాజేష్, దూసి శివప్రసాద్, శంబర కృష్ణలు శాస్త్రోక్తంగా యాగ ప్రక్రియను నిర్వహించారు. యాగం విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు అమ్మవారి శేషవస్త్రాలను, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రచారం



కవులవాడలో ప్రచార కరపత్రాలను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భోగాపురం: మండలం మరింత అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడును మరోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి ఓటర్లను కోరారు. మేము సిద్ధం – మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కవులవాడ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశంతో కూడిన ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. అనునిత్యం ప్రజా సంక్షేమానికి పాటుపడే సీఎం జగన్‌కు మద్దతుగా నిలిచి మీ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి ప్రజా పాలనకు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దంతులూరి రావాడబాబు, కొండపు కొత్తయ్యరెడ్డి, బైరెడ్డి యర్రప్పలనారాయణ, దాట్ల శ్రీనివాసరాజు, సుందర హరీష్, కోరాడ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు జనసేన ఎర

- ప్లాస్టిక్ బాటిళ్లు, బకెట్లతో ఓటర్లను మభ్యపెట్టే యత్నం
- ఇంటింటికీ పంపిణీ చేస్తున్న జనసేన కార్యకర్తలు
- యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన



పిన్నింటిపాలెంలో తమ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవిని గెలిపించాలంటూ మహిళలకు చీర, వాటర్ బాటిల్, బకెట్‌ను అందజేస్తున్న జనసేన కార్యకర్త కాగితాల చిన్న

భోగాపురం: నెల్లిమర్ల నియోజకవర్గం జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, చీరలు, బకెట్లు పంపిణీ చేస్తూ ఓటర్లకు ఎరవేస్తున్నారు. ఎన్నికల నిబంధనలకు పాతరేస్తున్నారు. భోగాపురం మండలంలోని రెడ్డి కంచేరు పంచాయతీ పిన్నింటిపాలెం గ్రామంలో సోమవారం రాత్రి జనసేన కార్యకర్త కాగితాల చిన్న అనేవ్యక్తి తమ ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించాలంటూ ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, చీరలు, మాధవి ఫొటో, గుర్తుతో కూడిన బకెట్లను మహిళలకు పంపిణీ చేస్తున్న ఫొటోలు సోషల్‌మీడియాలో హల్‌చల్ చేశాయి. మాధవి చిల్లర రాజకీయాలను పలువురు తప్పుబడుతున్నారు. ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని మేధావులు, విద్యావంతులు కోరుతున్నారు.

భక్తిభావాన్ని పెంపొందించాలి



నృత్య ప్రదర్శన చేస్తున్న నర్తనశాల డ్యాన్స్ అకాడమీ చిన్నారులు

విజయనగరం టౌన్: ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించేలా ఆధ్యాత్మిక కార్యక్రమాలను విస్తతం చేయాలని పైడితల్లి అమ్మవారి ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు పేర్కొన్నారు. స్థానిక మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి ఆవరణలో ప్రతీ మంగళవారం నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీ పైడిమాంబ ఆధ్యాత్మిక సేవా సంఘం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో నిర్వహణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నర్తనశాల డ్యాన్స్ అకాడమీ చిన్నారులు చేసిన ఆధ్యాత్మిక నృత్య ప్రదర్శనలు ఆద్యంతం భక్తులను భక్తిభావంలో ముంచెత్తాయి. అనంతరం నిర్వహించిన భక్తి గీతాలాపన ఆకట్టుకుంది. కార్యక్రమంలో నర్తనశాల డ్యాన్స్ డైరెక్టర్ డాక్టర్ భేరి రాధికారాణి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చల్ల.. చల్లగా... వాతావరణం

నెల్లిమర్ల రూరల్: అల్పపీడన ద్రోణి ప్రభావంతో మండల వ్యాప్తంగా వాతావరణం చల్లగా మారింది. ఉదయం నుంచి ఆకాశంలో మబ్బులు వ్యాపించాయి. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. దట్టంగా మేఘాలు కమ్ముకొని ఈదురు గాలులు వీచాయి. పలు గ్రామాల్లో స్వల్పంగా వర్షం కురిసింది. వాతావరణం చల్లగా మారడంతో ప్రజలు కాసేపు సేద తీరారు.